సాక్షి కామారెడ్డి


సోమవారం । 10 । మార్చి । 2025



సర్కారు బడికి జీవం

కల్వరాల్ హైస్కూల్‌ను సొంత డబ్బులతో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు.

- 9లో ▸



గరిష్టం/కనిష్టం
36.5 /14.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి స్వల్పంగా మంచు కురుస్తుంది. చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో 2,274 కేసుల పరిష్కారం

కామారెడ్డి క్రైం: జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 2,274 కేసులు పరిష్కారమయ్యాయని ఎస్పీ సింధు శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నమోదైన 257 ఐపీసీ కేసులు, డ్రంకన్ డ్రైవ్‌తో పాటు 1,797 ఎంవీ యాక్ట్ కేసులు, 220 పెట్టీ కేసులు, ఇతర కేసులు పరిష్కారమయ్యాయని వివరించారు. ఆయా కేసుల్లో కక్షిదారులను కలిసి రాజీయే రాజ మార్గమని అవగాహన కల్పిస్తూ, అనుకున్న దానికంటే ఎక్కువ మొత్తంలో కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

'మోడల్' ప్రవేశ పరీక్ష వాయిదా

సదాశివనగర్: మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశం కోసం వచ్చేనెల 13న నిర్వహించాల్సిన పరీక్షను 20వ తేదీకి వాయిదా వేసినట్లు సదాశివనగర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి తెలిపారు. ముందుగా ప్రకటించిన ప్రకారం ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు సోమవారంతో ముగియాల్సి ఉందని, దీనిని 20 వ తేదీ వరకు పొడిగించారని పేర్కొన్నారు. దీనిని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.

జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు ఎంపిక



దోమకొండ: మండల కేంద్రానికి చెందిన నలుగురు క్రీడాకారులు జాతీయ అర్చరీ పోటీలకు ఎంపికయ్యారని అర్చరీ కోచ్ ప్రతాప్ దాస్ తెలిపారు. కొల్లూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 2న జరిగిన రాష్ట్ర స్థాయి మినీ చాంపియన్ పోటీల్లో రికర్వు రౌండ్‌లో మంచి ప్రతిభ చూపిన బి.ఇందు, వర్షిణి, అకుల్, రమ్య జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు గుంటూరులో జరిగే జాతీయ స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు. వీరిని అర్చరీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అనిల్ కామినేని, జిల్లా అధ్యక్షుడు తీర్మల్ గౌడ్, కార్యదర్శి మోహన్‌రెడ్డి, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, కార్యదర్శి నర్సింహారెడ్డి తదితరులు అభినందించారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ. 200 కోట్లు మంజూరు



నిజాంసాగర్: నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 200 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో ఫోన్ ద్వారా మాట్లాడారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇస్కాన్ కార్యక్రమాలు ప్రశంసనీయం

కామారెడ్డి అర్బన్: సమాజంలో శాంతి, సోదరభావం, దాన గుణాలు, ఆధ్యాత్మిక, మానవ విలువలను పెంపొందిస్తున్న ఇస్కాన్ కార్యక్రమాలు ప్రశంసనీయమని పలువురు స్వామీజీలు పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని రామారెడ్డి రోడ్డులోగల ఇస్కాన్ కేంద్రంలో భజనలు, కీర్తనలు, భగవద్గీత ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పీఠాధిపతులు ఓంకారనంద స్వామి, రామస్వామి, సనకసనంద స్వామి, కృష్ణానందస్వామీజీ పాల్గొన్నారు. ఇస్కాన్ ఇన్‌చార్జి వెంకటదాసు ప్రభు వారికి జ్ఞాపికలను అందజేశారు.

'మీటర్' మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

సుభాష్‌నగర్: విద్యుత్ మీటర్లలో రీడింగ్ తక్కువ అయ్యేలా చేస్తామంటూ వస్తున్న వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఏపీటీఎస్ సీఐ గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో కొందరు వ్యక్తులు తక్కువ కరెంటు బిల్లు వచ్చేలా చేస్తామంటూ డబ్బులు తీసుకొని విద్యుత్ మీటర్‌లోని తీగలను కట్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. మీటర్‌లోని తీగలను కట్ చేయడం చట్టరీత్యా నేరమని, మోసాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ మీటర్ తిరగకుండా చేస్తామని ఎవరైనా వస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.



కామారెడ్డి మున్సిపాలిటీకి సంబంధించిన చెత్త సేకరణ వాహనాలు

కార్మికులకు లేదు ధీమా!

- కామారెడ్డి బల్దియాలో చెత్త వాహనాల ఇన్సూరెన్స్ ల్యాప్స్
- ప్రీమియం చెల్లింపు గడువు ముగిసి ఏడాది
- ఖజానాలో నిధులు లేకపోవడంతో రెన్యువల్ చేయని అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వాహనం నడిపే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి. వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలుండాలి. ఇన్సూరెన్స్ కూడా ఎంతో ముఖ్యం. ఎందుకంటే ఏదేని పరిస్థితుల్లో యాక్సిడెంట్ జరిగితే వాహన డ్రైవర్‌కు గానీ, ప్రమాదానికి గురైన వ్యక్తులకుగానీ ఇన్సూరెన్స్ సంస్థ ద్వారా ఎంతో కొంత ప్రయోజనం కలుగుతుంది. అందుకే వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరి. ఈ విషయం తెలిసినా కామారెడ్డి బల్దియా అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బల్దియాకు సంబంధించిన చెత్త సేకరణ ట్రాక్టర్లు, ఆటోల ఇన్సూరెన్స్ రెన్యువల్ చేయకపోవడంతో ల్యాప్స్ అయ్యాయి.

జరగరానిది జరిగితే...

చెత్త సేకరించే ఆటోలు, ట్రాక్టర్లు ప్రతిరోజూ పట్టణంలో తిరుగుతుంటాయి. పారిశుద్ధ్య కార్మికులు నిత్యం ఇంటింటికీ తిరుగుతూ చెత్త సేకరించి డంపింగ్ యార్డు వద్ద వదిలేస్తుంటారు. ట్రాక్టర్లు, ఆటోలు రోడ్లపై తిరిగే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే కార్మికుల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

రూ. 7 లక్షలు చెల్లించలేక..

మున్సిపాలిటీలో చెత్త సేకరించే ఆటోలు 30 ఉండగా.. ఇందులో ఆరు మూలకు చేరాయి. ప్రస్తుతం 24 ఆటోలు తిరుగుతున్నాయి. 11 ట్రాక్టర్లు ఉండగా రెండు మూలకు చేరడంతో తొమ్మిది ట్రాక్టర్లే వినియోగంలో ఉన్నాయి. ఒక డోజర్ కూడా ఉంది. ఆయా వాహనాలకు గతేడాది ఫిబ్రవరి, మార్చి మాసాలలోనే ఇన్సూరెన్స్ రెన్యువల్ చేయాల్సి ఉంది. అన్ని వాహనాల ఇన్సూరెన్స్ రెన్యువల్‌కు కలిపి సుమారు రూ. 7 లక్షల వరకు అవసరం. కానీ బల్దియాలో డబ్బులు లేవంటూ సంబంధిత అధికారులు రెన్యువల్ విషయంలో నిర్లక్ష్యం చేశారు. దీంతో సుమారు ఏడాది కాలంగా ఇన్సూరెన్స్ లేకుండానే వాహనాలు తిరుగుతున్నాయి.

రెన్యువల్‌పై దృష్టి సారించాలి

మున్సిపల్ అధికారులు ఆటోలు, ట్రాక్టర్ల ఇన్సూరెన్స్ విషయంలో తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఎప్పుడైనా వాహనాల ఇన్సూరెన్స్‌కు సంబంధించి గడువుకు ముందే రెన్యువల్ ప్రాసెస్ చేయాల్సి ఉంటుంది. అయితే బల్దియాలో నిధుల సమస్య అంటూ ఇన్సూరెన్స్‌ను నిర్లక్ష్యం చేశారు. అప్పుడు పనిచేసిన అధికారులు కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులపై చూపిన ఆసక్తి వాహనాల ఇన్సూరెన్స్ విషయంలో చూపకపోవడం గమనార్హం. ఈ విషయమై ఉన్నతాధికారులు దృష్టి సారించి, బీమా రెన్యువల్ చేయించి కార్మికులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

వన్యప్రాణుల దాహం తీరేదెలా?

- జిల్లాలో 212 సాసర్ పిట్లు..
- వేసవి ప్రారంభమైనా నీరు నింపని అధికారులు



అడ్విలింగాల శివారులో నీరు లేక ఖాళీగా ఉన్న సాసర్‌పిట్

ఎల్లారెడ్డిరూరల్: ఎండలు ముదురుతుండడంతో వన్యప్రాణులు దాహంతో అల్లాడుతున్నాయి. సాసర్ పిట్లలో నీరు నింపకపోవడంతో దాహార్తిని తీర్చుకునేందుకు పొలాల వద్దకు వస్తున్నాయి. దీంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు.

జిల్లాలో 82 వేల హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. అటవీ శాఖ ఎనిమిది రేంజ్ కార్యాలయాల ద్వారా సేవలందిస్తోంది. వన్య ప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అటవీ శాఖ 212 సాసర్ పిట్లను ఏర్పాటు చేసింది. వాటిలో నీటిని నింపితే అటవీ జంతువులు దాహంతో ఉన్నప్పుడు అక్కడికి వచ్చి నీటిని తాగి ఉపశమనం పొందుతాయి. ఏటా ఫిబ్రవరి 1 నుంచి నీటిని నింపుతారు. నెలలో రెండుమూడు సార్లు నీటిని నింపుతారు. అయితే ఈ ఏడాది వేసవి కాలం ప్రారంభమై ఎండలు ముదురుతున్నా ఇప్పటివరకు నీటిని నింపేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో వన్యప్రాణులు పొలాల వద్దకు వచ్చి పంటలను దెబ్బతీస్తున్నాయి. అటవీ అధికారులు స్పందించి వన్యప్రాణులు పొలాల వద్దకు రాకుండా చూడాలని కోరుతున్నారు.

నీటిని నింపాలి

అటవీ ప్రాంతంలోని సాసర్‌పిట్లలో నీరులేకపోవడంతో జంతువులు పరిసర ప్రాంతాలలోని పొలాల్లోకి వస్తాయి. సాసర్‌పిట్లలో నీరు ఉంటే పొలాల్లోకి రావు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– దుర్గయ్య, అడ్విలింగాల

చర్యలు తీసుకుంటాం

అటవీ జంతువులు తాగు నీటి కోసం ఇబ్బందిపడకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రెండుమూడు రోజుల్లో అన్ని సాసర్ పిట్లలో నీటిని నింపి వన్యప్రాణుల దాహార్తి తీరుస్తాం.

– ఓంకార్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, ఎల్లారెడ్డి

మహిళలను గౌరవించాలి



బ్యాంకులోని మహిళా సిబ్బందితో చైర్మన్ రమేశ్‌రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

సుభాష్‌నగర్(నిజామాబాద్‌అర్బన్): ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి సూచించారు. ఆదివారం నగరంలోని డీసీసీబీలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రేమ, త్యాగం, సహనం కలిస్తే మహిళ అని కొనియాడారు. అనంతరం సీనియర్ మహిళా మేనేజర్లను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, సీఈవో నాగభూషణం వందే, టీసీసీబీఈఏ రాష్ట్ర నాయకురాలు రాధ, నిజామాబాద్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, సందీప్, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారికి చక్రస్నానం

తెలంగాణ తిరుమలలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న వేదపండితులు, కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం దంపతులు, భక్తులు

బాన్సువాడ : బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవారికి చక్ర స్నానం చేయించారు. అంతకు ముందు వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం శ్రీవారి విగ్రహానికి పంచామృతాభిషేకం చేసి, ఆలయంలో ఉన్న పుష్కరిణిలో వేదపండితులు చక్రస్నానం చేయించారు. చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, నేతలు పోచారం శంభురెడ్డి, పోచారం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరకొర సిబ్బందితో ఇబ్బందులు

- ఉపాధి హామీలో సిబ్బంది కొరత
- ఖాళీలతో పర్యవేక్షణ లోపాలు
- పని ప్రదేశాల్లో వసతులు కరువు
- సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న కూలీలు



లింగుపల్లిలో పనులు చేస్తున్న కూలీలు

దోమకొండ: ఉపాధి హామీ పథకంలో సిబ్బంది కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండడంతో కూలీల హాజరు నమోదు, పనుల గుర్తింపు, కూలి పనులు చేసిన వారికి బిల్లుల చెల్లింపు విషయాలలో జాప్యం జరుగుతోంది.

జిల్లాలో 526 గ్రామ పంచాయతీలున్నాయి. పంచాయతీకో ఫీల్డ్ అసిస్టెంటు ఉండాలి. అయితే జిల్లాలో 260 మంది మాత్రమే ఉన్నారు. దాదాపు సగానికిపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు కూడా చాలావరకు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల్లో అక్రమాలకు పాల్పడిన పలువురిని విధుల నుంచి తొలగించారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో పాత పంచాయతీ పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్లే పనులు చూడాల్సి వస్తోంది. అలాగే నూతనంగా ఏర్పాటైన పంచాయతీలలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉన్నవారిపైనే పనిభారం పడుతోంది. సిబ్బంది కొరతతో పనుల్లో పారదర్శకత లోపిస్తోందన్న ఆరోపణలున్నాయి. పనుల కొలతలు రికార్డు చేయడానికి టెక్నికల్ అసిస్టెంట్లు సైతం లేకపోవడంతో కూలి చెల్లింపులోనూ జాప్యం జరుగుతోంది.

వసతుల కల్పనలోనూ విఫలం

జిల్లాలో 2,52,790 జాబ్‌కార్డుల పరిధిలో 5,28,794 మంది కూలీలు పేర్లు నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం పనులకు 14,500 మంది మాత్రమే హాజరువుతున్నారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో పనులకు హాజరయ్యేవారి సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. సాధారణంగా వేసవిలో పని ప్రదేశాలలో కూలీలు సేదతీరడానికి అవసరమైన వసతులు కల్పిస్తారు. గతంలో టెంట్లు సరఫరా చేసేవారు. కానీ ఏడేళ్లనుంచి సరఫరా నిలిచిపోయింది. దీంతో కూలీలు చెట్లకిందే సేదతీరుతున్నారు. ప్రథమ చికిత్స కిట్లు కూడా ఎనిమిదేళ్లుగా సరఫరా కావడం లేదు. దీంతో పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే కూలీలు ఇబ్బందిపడుతున్నారు. ఉపాధి హామీ పథకంలో పోస్టులను భర్తీ చేయాలని, పని ప్రదేశంలో వసతులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

ఉన్నవారితోనే నెట్టుకొస్తున్నాం

జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత ఉంది. దీంతో ఆయా గ్రామాలలో పనుల పర్యవేక్షణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొందరికి అదనపు బాధ్యతలు అప్పగించాం. అభివృద్ధి పనులను ఏపీవోలు పర్యవేక్షిస్తున్నారు. కూలీలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

– సురేందర్, డీఆర్‌డీవో, కామారెడ్డి

లక్ష్యానికి చేరువలో పన్ను వసూళ్లు

- జిల్లాలో ఇప్పటికే 87 శాతం వసూలు
- నెలాఖరులోగా వంద శాతం పూర్తి చేస్తామంటున్న అధికారులు

బిచ్కుంద: గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరైన పన్నులను వందశాతం వసూలు చేయడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య కార్మికుల వేతనాల చెల్లింపు తదితర వాటికి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో పన్ను నిధులపైనే జీపీలు ఆధారపడ్డాయి. దీంతో ఎలాగైనా వందశాతం పన్ను వసూలు చేసి వాటితో కొన్ని సమస్యలైనా పరిష్కరించుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. అందులో భాగంగా జీపీ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికీ తిరుగుతూ వివిధ రకాల పన్నులు వసూలు చేస్తున్నారు.

సహకరించాలని కోరుతున్న కార్యదర్శులు..

జిల్లాలో రూ.14 కోట్ల 97 లక్షల ఆస్తి పన్ను వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు రూ.13 కోట్ల 2 లక్షల పన్ను వసూలు చేశారు. లక్ష్యంలో 87 శాతం పూర్తి అయ్యింది. ఈ నెలాఖరు వరకు అన్ని పంచాయతీల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఉన్నతాధికారులు కార్యదర్శులకు దిశానిర్దేశం చేస్తున్నారు. కాగా ప్రభుత్వం నుంచి నిధుల విడుదల ఆలస్యం కావడంతో చాలాచోట్ల పంచాయతీ కార్యదర్శులే సొంత డబ్బులతో పనులు చేయించారు. ప్రస్తుతం వారంతా అప్పుల్లో ఉన్నారు. దీంతో 'గ్రామాభివృద్ధి కోసం ఖర్చు పెట్టాం.. ప్రస్తుతం అప్పుల్లో ఉన్నాం.. పన్ను చెల్లించి సహకరించండి' అంటూ ప్రజలను కోరుతూ పన్నులు వసూలు చేస్తుండడం గమనార్హం.



బిచ్కుందలో పన్ను రసీదు అందిస్తున్న సిబ్బంది

ప్రజల నిలదీతలు..

పన్నుల వసూళ్ల కోసం వెళ్తున్న సిబ్బందికి కొన్ని గ్రామాల్లో ప్రజల నుంచి నిలదీతలు ఎదురవుతున్నాయి. కనీస సదుపాయాలు లేవు, వీధులు, డ్రైనేజీలు దుర్గంధంగా మారాయి, తాగునీరు రావడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమై 14 నెలల అవుతున్నా జీపీల అభివృద్ధికి నిధులు విడుదల కాకపోవడంతో సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని అధికారులు ప్రజలకు నచ్చజెబుతున్నారు.

లక్ష్యాన్ని చేరుకుంటాం

పన్ను చెల్లింపులతోనే గ్రామాభివృద్ధి జరుగుతుందని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వంద శాతం పన్ను వసూలు చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. వచ్చే పన్నులతోనే అభివృద్ధి పనులు చేసుకోవచ్చనే ఉద్దేశంతో ప్రయత్నిస్తున్నాం.

– కృష్ణ, ఎంపీవో బిచ్కుంద

ఎండుతున్న పంటలు



పెద్దకొడప్‌గల్ మండలం అంజని శివారులో నీరందక ఎండిపోతున్న వరి పంట

ఎండలు ముదురుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీంతో బోరుబావుల్లో ఊట తగ్గిపోయి పంటలకు నీరందడం కష్టంగా మారుతోంది. ఇప్పటికే నీరందక పలు ప్రాంతాలలో పంటలు ఎండుముఖం పట్టాయి. ఎండలు మరింత ముదిరితే పంటలు గట్టెక్కడం కష్టమేనని రైతులు పేర్కొంటున్నారు.

– నిజాంసాగర్

క్లుప్తంగా

శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



భారతమాత చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

నిజామాబాద్ రూరల్: వచ్చే నెల లో నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని విశ్వ హిందూ పరిషత్ ఇందూరు జిల్లా కార్యదర్శి పరాయితం లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ని విశ్వ హిందూ పరిషత్ కార్యాలయంలో ప్రఖండ సమావేశం నిర్వహించారు. ప్రాంత కార్యదర్శి పరాయితం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రాబోయే కార్యక్రమాలు, ఉత్సవాలు, పరిషత్ వర్గ, బజరంగ్ దళ్ శౌర్యా ప్రశిక్షణ వర్గ, దుర్గా వాహిని వర్గ, మాతృశక్తి వర్గాల గురించి చర్చించారు. అంతకు ముందు శ్రీరాముని, భారత మాత చిత్రపటాలకు విశ్వ హిందూ పరిషత్ నాయకులు పూలమాలలు వేశారు. పదాధికారులు, ప్రఖండ అధ్యక్షులు, బజరంగ్ దళ్ సంయోజక్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ధర్పల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని శాఖ గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి అన్నారు. ఆదివారం ధర్పల్లి మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రంథాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. ఇటీవల ధర్పల్లి గ్రంథాలయానికి మౌలిక సదుపాయాల కోసం రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో గ్రంథాలయంలో చేసిన పనులను పరిశీలించారు. గ్రంథాలయంలో వైఫై కనెక్షన్, నాలుగు కంప్యూటర్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని గ్రంథ పాలకుడు కిషన్‌ను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గ్రంథాలయ చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చెలిమెల నర్సయ్య, చిన్నారెడ్డి, గంగారెడ్డి, సుభాష్, సురేందర్ గౌడ్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

ఎండిన పంటల పరిశీలన

ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లిలో ఎండి న వరి పంటలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేశ్ ఆదివారం పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని అన్నారు. నియోజకవర్గంలో చెక్ డ్యాములు, కుంటలను పునర్ నిర్మించాలన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, చిన్నూ, నాయుడు రాజన్న, సక్కీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మోపాల్‌లో వాహనాల తనిఖీ

మోపాల్: మండలకేంద్రంలో ఆదివారం ఎస్సై యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీలు చేపట్టారు. అలాగే వాహనదారులకు డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. దీంతో 3 డ్రంకన్‌డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిబంధనలు పాటించిన వాహనదారులకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

కొత్త వేతనాలు వచ్చేదెప్పుడు?

- మెయిన్ అంగన్‌వాడీలుగా మినీ అంగన్‌వాడీ కార్యకర్తల గుర్తింపు
- 2024లోనే ఉత్తర్వులు జారీ
- అయినా సిబ్బందికి పాతవేతనాలే మంజూరు



తాళ్లరాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న టీచర్

మోర్తాడ్(బాల్కొండ): మినీ అంగన్‌వాడీల నుంచి మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తింపు పొందినా పాత వేతనాలు మంజూరుకావడంతో సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలు గడిచినా తమకు కొత్త వేతనాలు రావడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 135 మంది సిబ్బంది..

జిల్లాలో 135 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను మెయిన్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం 2024 జనవరిలోనే ఉత్తర్వులను జారీ చేసింది. కానీ ఆర్థికశాఖ ఆమోదం లభించకపోవడంతో అప్‌గ్రేడ్ చేయబడిన అంగన్‌వాడీ కార్యకర్తలకు కొత్త వేతనానికి బదులు, పాత వేతనమే అందుతుంది. మినీ అంగన్‌వాడీలకు మొదట్లో నెలకు రూ.7,500ల చొప్పున వేతనం లభించేది. అప్‌గ్రేడ్ చేయడంతో వారికి ప్రతి నెలా రూ.15వేల వేతనం అందాల్సి ఉంది. అప్‌గ్రేడ్ చేసిన తొలినాళ్లలో రెండు నెలల పాటు కొత్త వేతనం అందించారు. సాంకేతిక కారణాలతో ఆర్థికశాఖ ఆమోదం లభించలేదని ఏప్రిల్ 2024 నుంచి పాత వేతనమే అందిస్తున్నారు. ఏ అంగన్‌వాడీ కేంద్రంలోనైనా ఒకే విధమైన పని భారం ఉందని ఒక చోట తక్కువ మరో చోట ఎక్కువ అనే తేడా ఏమి లేదని కార్యకర్తలు చెబుతున్నారు. వేతనం విషయంలోనే ప్రభుత్వం దోబూచులాడుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎన్నిమార్లు విన్నవించినా..

అప్‌గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు కొత్త వేతనం చెల్లించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు, ఆర్థిక శాఖకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదని సిబ్బంది పేర్కొంటున్నారు. తమ శాఖ విధులే కాకుండా ప్రభుత్వం సూచించిన ఎలాంటి పనినైనా ఎంతో బాధ్యతతో చేస్తున్న తమ పట్ల ఎవరూ కనికరం చూపడం లేదని అప్‌గ్రేడ్ చేయబడిన అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి..

అప్‌గ్రేడ్ చేయబడిన మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు కొత్త వేతనం చెల్లించాలని ఎన్నోమార్లు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదు. మహిళా దినోత్సవం సందర్భంగానైనా ప్రభుత్వం స్పందించి, అంగన్‌వాడీ కార్యకర్తలకు శుభవార్తను అందించేలా చొరవ తీసుకోవాలి.

–ఖైరి దేవగంగు, అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

జిల్లాకు ఎంపీ అర్వింద్ తెచ్చిన నిధులు ఎన్ని?

నిజామాబాద్ సిటీ: రెండు పర్యాయాలు ఎంపీగా గెలిచిన అర్వింద్ జిల్లాకు ఎన్ని నిధులు తెచ్చారని, ఏయే పనులు చేపట్టారో తెలపాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ భవన్‌లో ఆదివారం నుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కేశవేణు మాట్లాడుతూ.. ఎంపీ అర్వింద్ మతిభ్రమించి కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఇష్టారీతిన మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని విమర్శించే స్థాయి అర్వింద్‌కు లేదన్నారు. తాహెర్ మాట్లాడుతూ.. జిల్లాలో నవోదయ ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందో జిల్లా విద్యాశాఖ అధికారులు ఆలోచిస్తారన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా కేంద్ర గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజలను తప్పుదోవ పట్టించడానికే..

నిజామాబాద్ సిటీ: కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిన ప్రతిసారి ఎంపీ అరవింద్ అబద్ధపు వాదనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి యత్నిస్తున్నాడని రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి కేవలం మాటలతో పబ్బం గడపడం అర్వింద్‌కు అలవాటే అని అన్నారు. నిజంగా ఎంపీ అర్వింద్‌కు నవోదయ సమస్య పరిష్కారం కావాలంటే బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో మాట్లాడితే బాగుండేదన్నారు. జిల్లా అభివృద్ధిలో సుదర్శన్ రెడ్డికి పోటీ ఎవరూ లేరన్నారు

47ఏళ్ల తర్వాత కలిసిన మిత్రులు

భిక్కనూరు: చిన్ననాటి మిత్రులందరూ దాదాపు 47ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వారంతా ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. కామారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1977–78 ఎస్సెస్సీ బ్యాచ్ బి సెక్షన్ విద్యార్థులు ఆదివారం భిక్కనూరు

మండలంలోని బీటీఎస్ చౌరస్తా వద్ద పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఏళ్ల తర్వాత వారంతా కలుసుకోవడంతో చిన్ననాటి తీపీ గుర్తులను నెమరువేసుకున్నారు. ప్రతి ఏడాది ఇలానే కలుసుకోవాలని, స్నేహితుల కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో ఆనాటి పూర్వ విద్యార్థులు శ్రీధర్, భూమయ్య, సునీల్‌కుమార్, చాట్ల రాజేశ్వర్, పాత బాల్‌కిషన్, రామలింగం, పార్శి మధుసూధన్, వెంకటరమణ, కస్వ వెంకటేశం, ముప్పారపు రాజేందర్, బీమ్‌రావు, గోజే రాజేందర్, రమేష్, చిట్టిమధు, ఇంద్రసేనారెడ్డి తదితరులు ఉన్నారు.



కామారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1977-78 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

38ఏళ్ల తర్వాత..

భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి జెడ్పీహెచ్ఎస్ 1986–87 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. బస్వాపూర్ గ్రామంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాటి విద్యార్థులందరూ హాజరయ్యారు. సుమారు 38ఏళ్ల తర్వాత వారంతా కలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. తమతో చదువుకుని స్వర్గస్తులైన నలుగురు స్నేహితుల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఆనాటి గురువులను కార్యక్రమానికి ఆహ్వానించి, సన్మానించారు.



పెద్దమల్లారెడ్డి జెడ్పీహెచ్ఎస్ 1986-87 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

నగరంలో క్రికెట్ అభిమానుల సంబురాలు

- టీంఇండియా చాంపియన్స్ ట్రోఫీ గెలవడంతో టపాసులు కాల్చిన యువత



సంబురాలు చేసుకుంటున్న నగరవాసులు



నగరంలో టపాసులు కాలుస్తున్న అభిమానులు

నిజామాబాద్‌నాగారం: నగరంలో క్రికెట్ అభిమానుల సంబురాలు మిన్నంటాయి. దుబాయ్‌లో ఆదివారం జరిగిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా– న్యూజిలాండ్ తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఈమ్యాచ్‌లో ఇండియా ఘన విజయం సాధించింది. దీంతో నగరంలోని పలు కాలనీల్లో క్రికెట్ అభిమానులు వీధుల్లోకి వచ్చి సంబురాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు. జయహో.. భారత్.. అంటు నినాదాలు చేశారు. అలాగే పలువురు అభిమానులు సాక్షితో తమ అభిప్రాయాలను తెలిపారు.

రోహిత్‌శర్మ బ్యాటింగ్ అదిరింది..



ఫైనల్ మ్యాచ్ ఏవిధంగా సాగుతుందోనని అందరం కంగారు పడ్డాం. టాస్ కివీస్ గెలవడంతో బ్యాటింగ్ ఎంచుకుంది. అయినా మన భారత బౌలర్లు బాగా రాణించారు. తక్కువ స్కోరుకే వారిని కట్టడి చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మన జట్టులో రోహిత్‌శర్మ చక్కటి ఇన్నింగ్స్ ఆడారు. 76పరుగులతో మెరుగైన ప్రదర్శన ఇచ్చారు.

–గజం రమేశ్, వినాయక్‌నగర్

టీమిండియా సమష్టి విజయం



టీమిండియా సమష్టిగా ఆడి చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలవడం చాలా సంతోషంగా ఉంది. ఒక్కరు, ఇద్దరు ఆడితే మ్యాచ్ గెలవడం కష్టం అవుతుంది. ఈరోజు ఆటలో మన జట్టు సభ్యులందరూ రాణించారు. ప్రత్యర్థి జట్టును తక్కువ స్కోర్‌కే కట్టడి చేశారు. బ్యాటింగ్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేయడంతో భారతజట్టుకు విజయం దక్కింది.

–బొడ్డుల దేవేందర్, నిజామాబాద్

అందరూ రాణించారు..



వరుసగా మ్యాచ్‌లు గెలవడం వెనుక విరాట్ కోహ్లి కష్టం దాగి ఉంది. ప్రతి మ్యాచ్‌లో విరాట్ రాణించి ప్రత్యర్థులను చిత్తు చేసి ఫైనల్‌కు తీసుకవచ్చారు. ఫైనల్ మ్యాచ్‌లో విరాట్ అవుట్ కావడం చాలా బాధాకరం. ఈ మ్యాచ్‌లో జట్టు సభ్యులందరూ రాణించి, విజయం సాధించారు.

–శ్రీజ, క్రికెట్ క్రీడాకారిణి నిజామాబాద్

ఈ విజయం క్రీడాకారులకు ఆదర్శం



భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీని గెలుచుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ విజయం క్రీడాకారులందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులకు, అభిమానులకు ఇది పండుగ రోజు.

–వర్ష, క్రికెట్ క్రీడాకారిణి, నిజామాబాద్

చిరుప్రాయంలోనే ప్రాణాంతక వ్యాధి

- క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పచ్చలనడ్కుడకు చెందిన నిఖిలేష్
- చికిత్సకు రూ.60లక్షలు ఖర్చవుతుందంటున్న వైద్యులు
- దాతలు ఆదుకోవాలంటూ బాలుడి తల్లిదండ్రుల వేడుకోలు



లుకేమియా క్యాన్సర్‌తో బాధపడుతున్న నిఖిలేష్

వేల్పూర్: చిరుప్రాయంలోనే ప్రాణాంతక వ్యాధికి గురైన ఓ బాలుడు, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య చికిత్సకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు పేర్కొనడంతో తల్లిదండ్రులు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన నవీన్ రెడ్డి, మనోజ దంపతులకు కుమారుడు నిఖిలేష్ ఉన్నాడు. ప్రస్తుతం అతడు ఆరో తరగతి చదువుతుండగా ఇటీవల అనారోగ్యానికి గురికాగా వైద్యపరీక్షలు చేయించారు. అందులో అతడికి అరుదైన బ్లడ్ క్యాన్సర్ సోకినట్లు వైద్యులు తెలిపారు. దీంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఇప్పటిదాకా రూ. 14 లక్షలు చికిత్సకు ఖర్చు చేశారు. నిఖిలేష్ పూర్తి కోలుకోవాలంటే చికిత్సకు రూ. 60లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారని బాలుడి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతఖర్చు భరించే స్తోమత తమకు లేదని, దాతలు తోచినంత సహాయం అందించాలని వేడుకుంటున్నారు. 9494719197 నంబరుకు ఫోన్‌పే చేసి, కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని కోరుతున్నారు.

చేపలను గ్రామంలోనే విక్రయించాలి

- ఇతర ప్రాంతాలకు తరలించొద్దు
- వాజిద్‌నగర్‌వాసుల డిమాండ్
- చేపల వాహనం అడ్డగింత



వాజిద్‌నగర్ జీపీ వద్ద నిలిపిన చేపల వాహనం

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని వాజిద్‌నగర్ గ్రామ చెరువులో గంగపుత్రులు పట్టిన చేపలను గ్రామంలోనే విక్రయించాలని గ్రామస్తులు కోరారు. ఇతర ప్రాంతాలకు తరలించొద్దని చేపల వాహనాన్ని శనివారం స్థానికులు అడ్డుకున్నారు. ప్రస్తుతం వాహనాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దనే నిలిపిఉంచారు. స్థానికంగా చేపలు అమ్ముడు పోవడం లేదని, అందుకే హైదరాబాద్‌కు తీసుకెళ్లి విక్రయిస్తామని గంగపుత్రులు పేర్కొంటున్నారు. సుమారు రూ.6 లక్షల విలువ ఉన్న చేపల వాహనాన్ని రెండు రోజుల నుంచి జీపీ వద్ద పెట్టారని వెళ్లనీయకుండా అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడ్డుకున్న కొందరి వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. గ్రామంలో కొన్ని చేపలు విక్రయించాలని గంగపుత్రులకు సూచించిన ఒక్క చేప కూడా విక్రయించడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న రామ్మోహన్

డిచ్‌పల్లి: పద్మశాలీలు రాజకీయంగా మరింత ఎదగాల్సిన అవసరం ఉందని చేనేత పద్మ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొండ రామ్మోహన్ నేత అన్నారు. ఆదివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. పద్మశాలీల రాజకీయ అభివృద్ధి, అవకాశాల అంశాలపై చర్చించారు. పద్మశాలీలు రాజకీయంగా ఎదగడానికి తోటి పద్మశాలీలు ఏ విధంగా పాటుపడాలనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ అధ్యక్షుడు కట్ట అశోక్ నేత, హరికిషన్, రాంపల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ బస్టాండ్‌లో గంజాయి పట్టివేత



నిందితుడిని పట్టుకున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సుమారు 250 గ్రాములు ఎండు గంజాయిని పట్టుకున్నట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసు బృందం బస్టాండ్ వద్దకు వెళ్లగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని పట్టుకున్నారు. అతడి బ్యాగ్‌ను చెక్ చేయగా అందులో 250 గ్రాముల ఎండు గంజాయి ఉందన్నారు. అతడిని విచారించగా నవీపేట్ మండలం నాళేశ్వర్‌కు చెందిన బీస ప్రవీణ్(29)గా గుర్తించామన్నారు. ప్రస్తుతం అతడు నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఎలవాత్ గ్రామంలో ఉంటున్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి పట్టివేతలో కీలకపాత్ర పోషించిన ఎస్సై మొగులయ్య, సిబ్బందిని అధికారులు అభినందించారు.

నగరంలో మహిళ ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని కోటగల్లీలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. నాలుగోటౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. కోటగల్లీకి చెందిన మెరుగె కవిత(42)కు భర్త గతంలోనే చనిపోయాడు. కుమారుడు, కుమార్తె ఉండగా, కుమారుడు మనోజ్ పూల వ్యాపారం చేసి ఆర్థికంగా నష్టపోయాడు. దీంతో అతడు హైదరాబాద్ వెళ్లి, ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో కవిత మనోవేదనకు గురై, ఆదివారం ఉదయం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నగరంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రగాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని వినాయక్ నగర్‌లోగల ఓ బైక్ షోరూంలో సత్యనారాయణ(52) వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి అతడు విధులకు హాజరు కాగా, ఆదివారం ఉదయం పనులు ముగించుకొని బైక్‌పై న్యూహౌజింగ్‌బోర్డు కాలనీలోని తన ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో అతడి బైక్‌ను ఎదురుగా వచ్చిన పల్సర్ బైక్ ఢీకొట్టింది. ఈఘటనలో సత్యనారాయణకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని రామారెడ్డి–సదాశివనగర్ రోడ్డు మార్గంలో ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈఘటనలో కారులోని ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మెదక్ జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆదివారం కారులో రామారెడ్డి నుంచి సదాశివనగర్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో వారి కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. కారులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గమనించి క్షతగాత్రులను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సదాశివనగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ – కారు ఢీ: ముగ్గురికి గాయాలు

రుద్రూర్: మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని బోధన్–రుద్రూర్ ప్రధాన రహదారిపై ట్రాక్టర్ – కారు ఢీకొనడంతో కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. క్షతగాత్రులు రుద్రూర్ మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన వారిగా పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



కత్తిపోట్ల నిందితుల అరెస్టు

మాక్లూర్: మండలంలోని అమ్రాద్‌తండాలో ఈనెల 8న ముగ్గురిపై కత్తితో దాడి చేసిన కెతావత్ రమేష్ అలియాస్ విక్రం, కెతావత్ పీర్‌సింగ్‌లను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. అలాగే వారు దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు. తండాలోని చౌకధరల దుకాణం వద్ద డీలర్ భర్త మాలోత్ జ్యోతినాయక్, అతని ఇద్దరు సోదరులు రాజునాయక్, శ్రీనువాస్‌నాయక్‌లపై శనివారం కెతావత్ రమేష్ అలియాస్ విక్రం, కెతావత్ పీర్‌సింగ్‌లు కత్తితో దాడి చేసి పారిపోయిన విషయం తెలిసిందే. కాగ పరారీలో ఉన్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. కత్తిపోట్లకు గురైన ముగ్గురి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వివరించారు.

విద్యార్థిని చితకబాదిన హాస్టల్ వార్డెన్

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని గంగాస్థాన్ లోగల ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థిని హాస్టల్‌వార్డెన్ చితకబాదాడు. వివరాలు ఇలా.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన వాహజొద్దీన్ నగరంలోని కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. హాస్టల్‌లో వాహజొద్దీన్ చదవడం లేదని హాస్టల్ వార్డెన్ నిఖిల్ తీవ్రంగా కొట్టాడు. దీంతో విద్యార్థికి గాయాలు అయ్యాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా వారు కళాశాలకు వచ్చి వాగ్వాదానికి దిగారు. అనంతరం కళాశాల యజమాన్యంపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.